

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ ఐటిఐల్లో రెండో విడతలో పలు కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఎల్‌టిసి ఎడి వై.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఆగస్టు ఒకటో తేదీన ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, అనంతరం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. శ్రీకాకుళం డిఎల్‌టిసిలో రెండేళ్ల కోర్సులుగా ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటారు మెకానికల్... ఏడాది కోర్సులుగా వెల్డర్, కాపా, బాలికలకు ప్రత్యేకంగా షాయింగ్ టెక్నాలజీ (టైలరింగ్) కోర్సులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. వచ్చే నెల 3న సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

జీడికి మద్దతు ధర కల్పించాల్సిందే

- ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- 18న మహా ధర్నాను జయప్రదం చేయాలి
- రైతు, జీడి రైతు సంఘాల నాయకుల డిమాండ్
- ప్రారంభమైన జీపు జాతా



కవిటి : జీపుజాతాలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మోహనరావు

ప్రజాశక్తి - కవిటి

80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాల్సిదేనని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీడికి మద్దతు ధర కల్పించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన జీపుజాతా కవిటిలో శుక్రవారం ప్రారంభమైంది. రైతుసంఘం సీనియర్ నాయకులు పాతిన కృష్ణమూర్తి జెండా ఊపి జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పాలకుల నిర్లక్ష్యానికి, వ్యాపారుల దోపిడీకి గురైన జీడి రైతులు తీవ్ర కష్టనష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో రూ.14 వేలు పైబడి పలికిన 80 కేజీల జీడి పిక్కల బస్తా ధర నేడు రూ.7,500 నుంచి రూ.ఎనిమిది వేలకు దిగజారిందన్నారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న కేంద్రం, రైతు ప్రభుత్వం మాదే అని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం జీడికి ఎందుకు మద్దతు ధర ప్రకటించడం లేదని ప్రశ్నించారు.

విత్తు నుంచి విక్రయం వరకు అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించి ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రకటించినా, ఆచరణలో మాత్రం అవేవీ కనిపించడం లేదని విమర్శించారు. లాభమే పరమావధిగా భావించిన వ్యాపారులు సిండికేట్‌గా మారి జీడిపిక్కల ధర అమాంతం తగ్గించేస్తున్నారని, ఈ ఏడాది మరో అడుగు ముందుకేసి పరిశ్రమలు బంద్ అంటూ పిక్కలు కొనడం మానేశారని చెప్పారు. ఇంత జరుగుతున్నా జిల్లాలో మంత్రులు, స్పీకర్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని... జీడిపంట విస్తరణ, నిర్వహణకు గతంలో ఇచ్చిన రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జీపుజాతా ద్వారా గ్రామాల్లో పర్యటించి 18వ తేదీన కాశీబుగ్గ సంత మైదానంలో మహా ధర్నా చేపట్టనున్నామని, జీడి రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు సంగారు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జీడి రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, జీడి పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కేరళ తరహాలో జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తొలి రోజు జాతా ప్రగడపుట్టుగ, ముత్యాలపేట, భైరిపురం, జగతి, బొరివంక, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మాణిక్యపురం గ్రామాల మీదుగా సోంపేట మండలానికి చేరుకుంది. జాతా ప్రారంభం సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు కె.హేమసూదనరావు, లక్ష్మణరావు జీడి రైతుల గోడుపై పాటలు పాడి ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సింహాచలం, టి.పాపారావు, బత్తిన.లక్ష్మీనారాయణ, అంబటి రామకృష్ణ, కె.వినోద్, కవిటి మాజీ సర్పంచ్‌లు బెందాళం వెంకటేశ్వరరావు, ఆరంగి మధు, బల్లెడ కృష్ణారావు, కొబ్బరి రైతు సంఘం అధ్యక్షులు బల్లెడ జయప్రకాష్, పుల్లట జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సోంపేట : జాతాలో భాగంగా మామిడిపల్లిలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న జీడి రైతులు

పైసా వసూల్



కాదేదీ కలెక్షన్లకు అనర్హమంటూ ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రతి అంశానికీ డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. పెళ్లి, పుట్టినరోజులు ఇలా ఏది వచ్చినా జనం నుంచి వసూలు చేసిన డబ్బులతోనే ఉత్సవాలు చేసుకోవడం అలవాటైంది. తాజాగా అధికార పార్టీకి చెందిన ఒక ముఖ్య నేత సతీమణి సొంత కళాశాలకు ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు కావాల్సి వచ్చింది. రాణి తలుచుకుంటే కలెక్షన్లకు కొదవేముంది?. వెంటనే తన ఆలోచనను మహిళా శిశు అభివృద్ధి సంస్థ (ఐసిడిఎస్) అధికారులకు తెలియజేశారు. వారు రంగంలోకి దిగి డబ్బులు వసూలు చేస్తున్నారు.

- సొంత కళాశాలలో సౌకర్యాలకు అధికార పార్టీ నేత సతీమణి ఒత్తిడి
- అంగన్‌వాడీల నుంచి కలెక్షన్లు
- రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు
- డబ్బులు ఇవ్వకుంటే తీవ్ర పరిణామాలని హెచ్చరికలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆమదాలవలస ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఏడు సెక్టార్ల పరిధిలో పైసా వసూల్ కార్యక్రమం భారీఎత్తున సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మహిళా శిశు అభివృద్ధి సంస్థ ఏడు సెక్టార్ల పరిధిలోని ఆమదాలవలస, అక్కులపేట, దూసి, తొగరాం పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తల దగ్గర నుంచి రూ.500 చొప్పున కింతలి, లోలుగు, పొందూరు సెక్టార్ల పరిధిలోని కార్యకర్తల దగ్గర నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేయాలని సూపర్‌వైజర్లకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై తాము ఎందుకు డబ్బులు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రశ్నించడంతో అధికారులు అసలు విషయం చెప్పారు. అధికార పార్టీకి చెందిన ఒక ముఖ్య నాయకుడి సతీమణి తన కళాశాలలోని ల్యాప్‌టాప్, ప్రింటర్ తదితర వస్తువులు పాడైపోయాయని కొత్తవి సమకూర్చాలని కోరారని, వాటి కోసమే ఈ విరాళాల సేకరణ అని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు బదులిచ్చినట్లు చర్చ సాగుతోంది. ఎవరైనా డబ్బులు ఇవ్వకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు సైతం జారీ చేసినట్లు తెలిసింది. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఈ డబ్బులు వసూలు సమస్య నెల రోజులుగా మహిళా శిశు అభివృద్ధి అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలకు మధ్య నలుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొంతమంది డబ్బులు చెల్లించగా, మరికొందరు నిరాకరించినట్లు తెలిసింది. మూడు, నాలుగు నెలలకోసారి జీతాలు వస్తున్నాయని, చాలీచాలనీ వేతనాలతో తామే బతకలేకపోతుంటే ఇందులో కలెక్షన్లు ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. వంటగ్యాస్, ఇంటి అద్దె, తదితర బిల్లులు మంజూరైనప్పుడు మహిళా శిశు అభివృద్ధి అధికారులకు కొంత ముట్టజెప్పున్నామని, అవి చాలదన్నట్లు కొత్తగా అధికార పార్టీ నేతలకూ డబ్బులు వసూలు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని డబ్బుల వసూళ్లను ఆపేయాలని కోరుతున్నారు. ఇదే అంశంపై ఐసిడిఎస్ పీడీ జయదేవిని వివరణ కోరగా, ఈ విషయం తన దృష్టికి రాలేదని విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'సంప్రదాయం' కళా గురుకులంలో ప్రవేశాలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం రూరల్ మండలం కల్లేపల్లిలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన సంప్రదాయం కళా గురుకులంలో కూడిపూడి నృత్యంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి సోమనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకాకుళం రూరల్ మండలం కల్లేపల్లిలోని సంప్రదాయం కళా గురుకులానికి ఎంపికైన విద్యార్థులకు హాస్టల్, భోజన సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

లోక్‌సభలో 'కణితి'కి నివాళ్లు

సమయం కేటాయించాలంటూ ఎంపీ రామ్మోహన్‌నాయుడు లేఖ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈ ఏడాది ఏప్రిల్ 15న మరణించిన మాజీ ఎంపీ కీర్తిశేషులు కణితి విశ్వనాథం గౌరవార్థం లోక్‌సభలో సంతాపం కోసం ఒక నిమిషం కేటాయించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. ఈమేరకు శుక్రవారం లేఖ రాశారు. ఎంపీగా నియోజకవర్గ ప్రజల కోసం అవిశ్రాంతంగా పనిచేశారని పేర్కొన్నారు. తన పనితీరుతో సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు పార్లమెంట్‌లో అత్యంత గౌరవం పొందారని గుర్తు చేశారు. రాబోయే వర్షాకాల సమావేశాల్లో నిమిషం మౌనం పాటించి గౌరవించుకోవాల్సిన అవసరముందని తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి జి.ఆర్ రాధిక

దత్తత గ్రామాల సందర్శన తప్పనిసరి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - నౌపడ

కానిస్టేబుళ్లు వారు దత్తత తీసుకున్న గ్రామాలను తప్పనిసరిగా సందర్శించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సంతబొమ్మాళి మండలం నౌపడ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణపై పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని ప్రజలకు సైబర్ క్రైమ్, మహిళల రక్షణ, పోక్సో చట్టం, దిశ యాప్‌లపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లోని అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని, నాటుసారా, మద్యం, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నిర్వహణ రికార్డులు, ముఖ్యమైన కేసు ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డిఎస్పి డి బాలచంద్రారెడ్డి, సిఐ సూర్య చంద్రమౌళి, నౌపడ ఎస్సై కిషోర్ వర్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలి

మందస : జీడి పరిశ్రమల అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై జీడి కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు శుక్రవారం ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 350 పరిశ్రమలు ఉన్నాయని.. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 40 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. వీరికి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ తదితర చట్టపరమైన బెనిఫిట్స్‌ను జీడి పరిశ్రమల యాజమాన్యాలు అమలు చేయకుండా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఈనెల 5 నుంచి జీడి పరిశ్రమలు అక్రమ లాకౌట్ ప్రకటించడంతో, వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. లాకౌట్ కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీడి యాజమాన్యాలు ఆడుతున్న నాటకాన్ని ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఖండించాలని కోరారు. ధర్నా అనంతరం తహశీల్దార్ బి.పాపారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.కేశవరావు, నాయకులు ఆర్.దిలీప్ కుమార్, జీడి కార్మిక సంఘం నాయకులు జి.బాలమ్మ, ఎస్.సరస్వతి, ఎం.కళావతి, వి.పద్మ, రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు కె.బాలకృష్ణ, ఎం.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మోటారు వాహనాలపై పన్ను భారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మోటారు వాహనాల పన్నును ప్రభుత్వం భారీగా పెంచి మోటారు కార్మికులను రోడ్డుకీడుస్తోందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ నాయకులు డబ్బీరు లీలాకృష్ణ విమర్శించారు. మ్యాక్సీ క్యాబ్‌లకు పెంచిన రోడ్డు ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్, ఇన్సూరెన్స్ తగ్గించాలని, ఇ-చలానా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన క్యాబ్ డ్రైవర్లు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా రంగం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.మూడు లక్షల కోట్ల ఆదాయాన్ని పలు పన్నుల రూపంలో కడుతున్నారని తెలిపారు. ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వం పన్నులు, ఇ-చలనాలు, జరిమానాలు వేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. గతంలో రోడ్డు ట్యాక్స్ ప్రతి మూడు నెలలకు చెల్లించేవారని, దానిపై ఇప్పుడు ఒక్కసారి రూ.రెండు వేలు అదనపు భారం మోపారని తెలిపారు. గ్రీన్ ట్యాక్స్ రూ.200 నుంచి రూ.ఆరు వేలకు పెంచారన్నారు. లేబర్ ట్యాక్స్ పేరిట రూ.1500 వసూలు చేస్తున్నారని చెప్పారు. గతంలో ఉన్న ఇన్సూరెన్స్ రూ.12 వేలు ఉంటే, ఇప్పుడు రూ.30 వేలకు పెంచారన్నారు. పెంచిన పన్నులు తగ్గించకపోతే వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ఎఒ బి.రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.సురేష్, జి.జగన్, డి.సూర్యనారాయణ, ఎస్.గోపి, పి.గజపతి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మోటారు ట్రాన్స్‌పోర్టు కార్మికులు

శాస్త్రీయంగా బయోమెడికల్ వ్యర్థాలు వేరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బయోమెడికల్ వ్యర్థాలను శాస్త్రీయంగా వేరు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బయోమెడికల్ వ్యర్థాలను వేరు చేసి, ఆస్పత్రి ఆవరణలో నిల్వ చేసే ప్రదేశంలో కెమెరాలు అమర్చి వాటిని కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షణ కోసం అనుసంధానం చేయాలని తెలిపారు. రోజువారీ పడకల వివరాలు, వాటి వల్ల ఉత్పన్నమైన వ్యర్థాలను శాస్త్రీయంగా వేరు చేసి, వాటిని రెయిన్‌బో ఇండస్ట్రీకి అందజేయాలన్నారు. వాటి వివరాలనూ ఆస్పత్రులు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తెలిపారు. బయోమెడికల్ వ్యర్థాలను మున్సిపల్ వ్యర్థాలతో జత చేయకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ ఎం.వి పద్మావతి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఇతర అధికారులు, జిల్లాలోని పలు ఆస్పత్రుల యాజమాన్యాల ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపన వేగవంతం

శ్రీకాకుళం : జిల్లాలో పరిశ్రమల స్థాపన వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరిశ్రమలు, ఎగుమతుల ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 130 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. శ్రేయాస్ పరిశ్రమ రణస్థలం మండలం చిట్టివలస గ్రామం వద్ద భూమి కోసం ప్రతిపాదనలు ఆమోదించడమైందన్నారు. ఆరు యాక్టర్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ రణస్థలం మండలం సంచాం వద్ద పరిశ్రమకు కమిషనర్‌కు పంపించేందుకు ఆమోదించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో అసంతృప్తికి తావివ్వొద్దు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో అసంతృప్తికి తావులేకుండా అధికారులు పనిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధిపై నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల పనితీరుపై 95 శాతం సంతృప్తి వ్యక్తమైందని, శతశాతం వచ్చేలా చూడాలన్నారు. పంచాయతీరాజ్‌శాఖలో అధికారులు, ప్రజాప్రతినిధులకు కొంత సమన్వయ లోపం ఉందని, దాన్ని సరిదిద్దుకోవాలన్నారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనుల అంచనాలు, బిల్లుల అప్‌లోడ్ అంశాల్లో ఏవైనా ఇబ్బందులు వస్తే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు పనులు చేపడుతోందని, పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పర్యవేక్షించాలని సూచించారు. నాడు-నేడు మొదట దశలో నిలిచిపోయిన కాంపౌండ్ వాల్స్ నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలను పంపాలని సమగ్రశిక్ష ఎపిసి జయప్రకాష్‌ను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదనపు తరగతి గదులకు అనుమతులిస్తామని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా చేపడుతున్న పనుల్లో పైపులైన్ల కోసం రోడ్లను తవ్వేసి ఆ తర్వాత వాటిని పూడ్చడం లేదంటూ పలువురు ఎంపిపిలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పనుల అంచనాల్లోనే గోతులు పూడ్చడం కూడా ఉంటుందని, అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లకు చెప్పాలని బొత్స ఆదేశించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఆరు ఎఎన్ఎం పోస్టులు ఖాళీ ఉన్నాయని పలువురు సభ్యులు చెప్పడంతో, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. బూర్జ మండలం పెద్దపాడు విత్తన క్షేత్రం అభివృద్ధి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ పంపాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో లోఓల్టేజి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, జూనియర్, అసిస్టెంట్ లైన్‌మెన్ల ఖాళీగా ఉన్న చోట సచివాలయాల్లో ఉన్న ఎనర్జీ అసిస్టెంట్ల సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. వైసిపి పాలన నాలుగేళ్ల పూర్తి కావడంతో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పరిస్థితి క్షేత్రస్థాయిలో ఎలా ఉందో తెలుసుకోవడానికి ప్రతి శుక్రవారం నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నియోజకవర్గాల సమీక్షలో భాగంగా ఈనెల 21న పలాస, 28న పాతపట్నం, ఆగస్టు 4న ఇచ్ఛాపురం, 11న నరసన్నపేట, 18న ఎచ్చెర్ల, 25న టెక్కలి, సెప్టెంబర్ ఒకటో తేదీన శ్రీకాకుళం నియోజకవర్గం ప్రగతిని సమీక్షిస్తామని తెలిపారు.

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ నియోజకవర్గాల సమీక్ష అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమల్లో అధికారులు తమ పనిలో లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ, ఆర్‌డిఒ బి.శాంతి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిపిఒ రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, సిపిఒ లక్ష్మీప్రసన్న, ఆమదాలవలస నియోజకవర్గ ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, పలు శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

సోంపేట థర్మల్ ఉద్యమం ఆదర్శం

ప్రజాశక్తి - సోంపేట

పర్యావరణ పరిరక్షణ, బీల భూములు కాపాడుకోవడం కోసం రైతులు సాగించిన సోంపేట థర్మల్ ఉద్యమం ఉద్యమాలకే ఆదర్శంగా నిలిచిందని పలువురు వక్తలు అన్నారు. సోంపేట థర్మల్ కాల్పుల ఘటనకు 13 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పోరాటంలో అమరులైన ముగ్గురు అమరులకు అమరవీరుల స్థూపం వద్ద పర్యావరణ పరిరక్షణ సమితి, మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యాన శుక్రవారం నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మానవ హక్కుల వేదిక నాయకులు వి.ఎస్ కృష్ణ, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు వై.కృష్ణమూర్తి మాట్లాడుతూ బీల భూముల్లో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయకుండా ఈ ప్రాంత ప్రజలు చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిందన్నారు. ప్రజల పోరాట ఫలితంగా ప్లాంట్ రద్దయిందని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల మనుగడ కోసం, భావితరాల భవిష్యత్ కోసం అమరులైన రైతుల త్యాగాలు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్ తరాల కోసం అందరూ ఒక్కటై సాగించిన ఈ ఉద్యమం చిరస్థాయిగా స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి నాయకులు పి.శివాజీ, ఎస్.రామారావు, మడే శరత్చంద్రుడు, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు సూరాడ చంద్రమోహన్, గోపాల్, బి.రామారావు, మానవ హక్కుల వేదిక నాయకులు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



అమరుల స్థూపం వద్ద నివాళ్లర్పిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ తదితరులు

నేడు ఐతమ్ 'పట్టభద్రుల' దినోత్సవం

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఏడో పట్టభద్రుల దినోత్సవం నిర్వహిస్తున్నామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐతమ్ బిఒజి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ పి.వి.జి.డి.ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యాన నిర్వహిస్తున్నామని, ఈ పట్టభద్రుల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా జెఎన్‌టియుజివి విజయనగరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకట సుబ్బయ్య పాల్గొంటారని అన్నారు. వీరితోపాటు ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు కళాశాల వార్షిక నివేదికను సమర్పించగా, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు వందన సమర్పణ చేస్తారన్నారు. 2019-23 బ్యాచ్‌కు చెందిన బిటెక్ విద్యార్థులు 788 మంది డిగ్రీ పొందేందుకు అర్హత సాధించారని అన్నారు. 2021-23 బ్యాచ్‌కు చెందిన 35 మంది పిజి విద్యార్థులు డిగ్రీలు పొందేందుకు అర్హత పొందారు, వీరిలో 409 మంది డిగ్రీ ప్రొవిజనల్ ధ్రువపత్రాలను పట్టభద్రుల దినోత్సవం సందర్భంగా స్వీకరించేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 409 మంది విద్యార్థులతో పాటు బంగారు పతకాలు సాధించిన మరో ఏడుగురు విద్యార్థులకు ఈ సందర్భంగా సత్కరిస్తామని తెలిపారు.


గరిమెళ్ల విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

స్వాతంత్ర్య పోరాట యోధుడు 'గరిమెళ్ల'

శ్రీకాకుళం అర్బన్ : స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ పాలకులపై పాటలనే ఈటెలుగా విసిరిన గొప్ప వాగ్గేయకారుడు గరిమెళ్ల సత్యనారాయణ అని సీనియర్ న్యాయవాది కొంక్యాన సుభాష్ అన్నారు. గరిమెళ్ల జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని గాంధీ మందిరంలో కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన గరిమెళ్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రచనల ద్వారా ఉద్యమానికి ఊతమిచ్చిన గొప్ప యోధుడు గరిమెళ్ల అని, ఆయన శ్రీకాకుళం జిల్లాలో పుట్టడం గర్వకారణమని అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ ఆర్కియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ తిరుపతిరావు మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో తన కలం, గళం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి బ్రిటీష్ పాలకులను తరిమికొట్టిన గొప్ప యోధుడు గరిమెళ్ల అన్నారు. విశ్రాంత తెలుగు పండితుడు పైడి హరనాథరావు గరిమెళ్లపై తాను రచించిన గేయాలను, స్వాతంత్ర్య పోరాటంలో ఆవిష్కరించిన గేయాలను ఆలపించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, బరాటం లక్ష్మణరావు, నటుకుల మోహన్, వావిలపల్లి జగన్నాథంనాయుడు, మెట్ట అనంతభట్లు, కొంక్యాన వేణుగోపాల్, డాక్టర్ బాడాన దేవభూషణ్ పాల్గొన్నారు.


మెళియాపుట్టి : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


సంతబొమ్మాళి : మాట్లాడుతున్న వాణి


పలాస : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న సాయికృష్ణ

సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

మెళియాపుట్టి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష దోహదపడుతుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలో సిరియాకండిలో సర్పంచ్ తెంటే రామారావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు పంపిణీతో పాటు సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేందరరావు, ఇఒ పిఆర్‌డి తారకేశ్వర, మండల ఎఒ నాగకర్షుడు, ఎపిఎం లలిత, మండల కో-ఆప్షన్ మెంబర్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని డోల, తలసముద్ర పంచాయతీ సచివాయాల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, సర్పంచ్ డోల వాణి, ఉదయ భాస్కర్, తహశీల్దార్ శ్రీరాములు, ఎంపిడిఒ ఉషశ్రీ, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, కణితి సత్తిబాబు, వై.వెంకటరమణ, చింతాడ ఉమ పాల్గొన్నారు.

పలాస : మండలంలోని రెంటికోట అభివృద్ధికి సర్పంచ్ శాసనపురి తిరుమలరావు కృషి చేస్తున్నారని ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ అన్నారు. మండలంలోని రెంటికోటలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నిధులు కేటాయించకపోయినా ప్రజలకు ఇబ్బందులు పడకుండా ముందుగా డబ్బులు వెచ్చించి పనులు చేపట్టడం గొప్ప విషయమన్నారు. శత శాతం ప్రభుత్వ పథకాలు అందించాలని లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం లబ్దిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సవర దాలమ్మ, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠ రావు, ఎఒ పొలారావు, సద్గుణ బాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : లాలపేట సచివాలయం ఆవరణలో 16,17 వార్డులకు సంబంధించిన నిర్వహించిన జగనన్న సురక్షలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీదివ్య, లాభాల స్వర్ణమణి, కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు బెంక లక్ష్మి పాల్గొన్నారు.

కవిటి: మండలంలో కుసుంపురంలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.శేఖర్, ఎంఇఒ ధనుంజయ మజ్జి, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు, ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, సర్పంచ్ ఊర్మిళ బిసాయి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని ఉమిలాడ, ఆర్.హెచ్.పురం సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, సర్పంచ్‌లు జోగి రాములమ్మ, ఎన్ని మన్మథరావు, ఉప్పాడ లోకనాథం, వైస్ ఎంపిపి ప్రతినిధులు పొందల రామకృష్ణ, నక్క భీమారావు, ఎంపిడిఒ ప్రేమలీల, డిటి వి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారానికి భద్రత ఏదీ?

'భవిష్యత్‌కు గ్యారెంటీ'లో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కంచిలి

సంక్షేమ పథకాల పంపిణీ, సేవల పేరుతో రాష్ట్ర ప్రజల నుంచి వాలంటీర్లు సేకరిస్తున్న వ్యక్తిగత సమాచారానికి భద్రత ఉందా? అని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రభుత్వానికి ప్రశ్నించారు. మండలంలోని ఎం.ఎస్‌పల్లిలో శుక్రవారం భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాశక్తి ప్రచార రథానికి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో వాలంటీర్లకు వేతనాలు ఇస్తున్నప్పుడు, వారిలో కొంతమంది చేసే తప్పులను గురించి ప్రశ్నించే హక్కు ఉంటుందని అన్నారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని గురించి ఆందోళన తలత్తేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాల్సిన ముఖ్యమంత్రి దానికి సమాధానం చెప్పకపోవడం బాధాకరమన్నారు.

సంస్థాగత లోపాలపై ప్రశ్నించేటప్పుడు దాన్ని దారి మళ్లించి వ్యక్తిగత దూషణలకు పాల్పడడం వైసిపి నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వాలంటీర్లు వైసిపి కార్యకర్తలని ముఖ్యమంత్రి భావిస్తే ప్రజల సొమ్ము కాకుండా పార్టీ నుంచి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు, నాయకులు బొడ్డ రామ్‌కుమార్, హరిబాబు, పిలక చిన్నబాబు, మద్దిల ఆనందరావు, మణ్రిపాటి పూర్ణచంద్ర, ఎస్.కామేష్, వునా రవి, తమరాల శోభన్‌బాబు, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.


కంచిలి : ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

వ్యవస్థలన్నీ నిర్వీర్యం

పలాస : వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందని, తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే చంద్రబాబు నాయుడు దిక్కుని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. మున్సిపాలిటీ 12వ వార్డులో శుక్రవారం భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవి శంకర్ గుప్త, అంబటి కృష్ణమూర్తి, గొల్ల చంద్రరావు పాల్గొన్నారు.

దేశ ప్రతిష్టను పెంచిన శాస్త్రవేత్తలు

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చంద్రునిపైకి చంద్రయాన్-3ని విజయవంతంగా పంపించడంలో కీలక పాత్ర పోషించిన భారత శాస్త్రవేత్తలు దేశ ప్రతిష్టను మరింతగా పెంచారని పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో అంతరిక్ష కక్ష్యలోకి దిగ్విజయంగా చంద్రయాన్‌ను పంపగలిగారని అన్నారు. ఈ ప్రయత్నంలో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. వారి సేవలను గుర్తించి దేశ పౌరులంతా సగౌరవంగా అభినందించాలన్నారు.


మాట్లాడుతున్న సింహాచలం

17న బైక్ యాత్ర

కొత్తూరు : వంశధార నిర్వాసితులు సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న బైక్ యాత్ర నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం పిలుపునిచ్చారు. మండలం కేంద్రంలోని శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సిఎం జగన్ చేపట్టిన పాదయాత్రలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అదనపు పరిహారం చెల్లించాలన్నారు. డిపట్టా భూములకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. 2017 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు యూత్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఈ యాత్ర కొత్తూరు నుంచి హిరమండలం మండలం మీదుగా ఎల్ఎన్‌పేట మండలం వరకు సాగుతుందని అన్నారు. ఈ బైక్ యాత్రలో నిర్వాసితులు ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈయనతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ఉన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీదేవి

19న బస్సు యాత్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గంలో ఈ నెల 19న నిర్వహించనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. గార మండల కేంద్రంలో భవిష్యత్‌కు భరోసా బస్ యాత్ర సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానాడులో పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించేందుకు ఈ బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొట్నూరు కృష్ణమూర్తి, అంబటి చక్రధర్, లోపింటి రాధాకృష్ణారెడ్డి, జల్లు రాజీవ్, కైబడి రాజు, గోర సురేష్, కోరాడ వెంకటరావు పాల్గొన్నారు.

వాలంటీర్లను విమర్శించడం తగదు


ఉషారాణి, ఎంపిపి

పొందూరు: రాష్ట్రంలో ఎటువంటి వివక్షత లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్న వాలంటీర్లను జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ విమర్శిం చడం తగదని ఎంపిపి కిల్లి ఉషారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతినెలా ఒకటిన ఇంటి వద్దనే పింఛన్‌ను అందజేస్తున్నారని, ఇంటి వద్దకే అన్ని సేవలను అందజేస్తున్న వారిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం మంచిది కాదని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన ఈ వాలంటీరు వ్యవస్థ దేశానికే తలమానికంగా ఉందని తెలిపారు. పవన్‌కళ్యాణ్ వాలంటీర్లపై చేసిన ఆరోపణలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి నారాయణమ్మ

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఇచ్ఛాపురం : జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతానికి చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణశాఖ అధికారులకు జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ సూచించారు. మండలంలోని ధర్మపురంలో ఉన్న జగనన్న లే అవుట్ ఇళ్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేసిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, పిట్టా మామయ్య, చిట్టిబాబు, ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

లోలుగులో హెల్త్ మేళా

పొందూరు: మండలంలో లోలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రం వారు వైద్యాధికారులు డాక్టర్ టి.సాగరిక, డాక్టర్ జి.రమేష్‌నాయుడు ఆధ్వర్యాన శుక్రవారం హెల్త్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళ్ల కలకలు, హెపటైటిస్, కాంట్రాసెప్టివ్ వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు కంటి చుక్కల మందులను పంపిణీ చేశారు. కమ్యూనిటీ హెల్త్ అఫీసర్స్ ఎం.రవికుమార్, వి.రవితేజ, ఎం.హర్షిత, పి.సూర్యకాంతం, హెచ్‌ఎం ఎ.సంజీవరావు, ఆశా కార్యకర్తలు జి.అమ్మన్న, జి.రవణమ్మ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఇలా ఉంటే సాగునీరు వచ్చేదెలా?

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


కాలువలో గడ్డిని చూపిస్తున్న రైతులు

ఈ రైతులు నిలుచున్నది దట్టమైన అడవిలో అని మీరు భావిస్తే పప్పులో కాలేసినట్లే. రైతులు నిలుచున్నది పంట భూములకు సాగునీరు అందించే సాగునీటి కాలువ కావడం గమనార్హం. ఉద్దానం కుర్మనాథపురానికి చెందిన రైతులు శుక్రవారం సమీపంలోని సాగునీటి కాలువను పరిశీలించారు. వంశధార కాలువ 60 ఆర్ఎల్ నుంచి బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు గ్రామాలకు 5ఎల్ బెండి కాలువ ద్వారా సాగునీరు వెళ్తుంది. 5ఎల్ బెండి కాలువకు కూర్మనాథపురం సమీపంలో కాలువ ఉంది. దీని ద్వారా నారాయణపురం, ఉద్దానం కూర్మనాథపురం పరిధిలో సుమారు 125 ఎకారలకు నీరు వెళుతుంది. అయితే ఈ 5ఎఎల్ కాలువలో కొన్నేళ్లుగా పూడికతీత పనులు జరగలేదు. ఇటీవల ఉపాధి పథకంలో 5ఎల్ బెండి కాలువలో ఉపాధి కూలీలు పనులు చేశారు. అదేవిధంగా 5 ఎఎల్ కాలువలో పనులు చేపట్టాలని, చివరి భూములకు నిరు అందించేలా నాయకులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని చింత ఎండునాయుడు, ఎర్రయ్య, జుత్తు రాజారావు, బడే కృష్ణమూర్తి, లఖినాన సత్యనారాయణ, చింత జయరాం, సిహెచ్. డొంబురు, కొయిల కోదండరావు, సిహెచ్.ఢిల్లీ కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు అభినందనలు


పలాస : ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న టి.జ్యోషిక, ఎస్.రమ్య, ఎ.హ్యాపీ, బి.పవిత్ర, కె.వూనరావుం గారలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొర్ల వైకుంఠరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ వారిని స్ఫూర్తిగా తీసుకొని చదువుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. భవిష్యత్‌లో అంతకుమించి ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యే విధంగా చదవాలన్నారు. పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.

టెక్కలి : మండలంలోని రావివలస, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదివిన రెయ్యి మనోజ్ శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు డి.బారతి, సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.వైష్ణవి, జి.ప్రవీణ్‌కుమార్‌లు నూజివీడు ట్రిపుల్‌ఐటికి, త్రినాథ్ పండా శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటికి ఎంపికయ్యారని, ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణికుమారి తెలిపారు. వీరికి ఉపాధ్యాయులు మార్పు నారాయణమూర్తి, రోణంకి గౌరీప్రసాద్, వాసు, నరేష్, పొందర అప్పారావులు అభినందించారు.

రెండు రోజులు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : రెండు రోజులపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త రోడ్డు ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు చేపడుతున్నామని, విద్యుత్ స్తంభాలు, తీగలు మారుస్తున్నామని అన్నారు. శని, ఆదివారాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఆమదాలవలస రూరల్ సెక్షన్ రాగోలు సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తరోడ్డు, గోపీనగరం, తోటాడ, అక్కివరం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు...

కవిటి: మండలంలోని మణిక్యపురం 11 కెవి ఫీడర్, ఆర్‌డబ్ల్యుఎస్ 11 కెవి ఫీడర్స్ పరిధిలోని రహదారి మార్గంలో ఉన్న పాత విద్యుత్ పోల్స్ తొలగించడంలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పలాస ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటి పరిధిలోని వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మణిక్యపురం పంచాయతీల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు.

'తైక్వాండో' పోటీలకు ముగ్గురు ఎంపిక

ఇచ్ఛాపురం : ఈ నెల 15 16 తేదీల్లో హైదరాబాద్ జిహెచ్‌ఎంసి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న ఛాంపియన్ వరల్డ్ తైక్వాండో పోటీలకు ముగ్గురు చిన్నారులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్‌లో పటాన దమయంతి, జూనియర్ విభాగంలో చాట్ల గిరి, ఆసీ కైలాస్ ఎంపిక కావడంతో పలువురు అభినందనలు తెలిపారు. ముగ్గురు క్రీడాకారులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. అభినందించిన వారిలో వార్డు కౌన్సిలర్లు పిలక విజయభాస్కర్‌రెడ్డి, కాళ్ల దిలీప్‌కుమార్, పిఇటి అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణయ్య, పి ఈ టి అసోసియేషన్ అధ్యక్షుడు కష్ణయ్య, కోచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులు


శస్త్రచికిత్స చేయించుకున్న ముకుందరెడ్డితో వైద్య సిబ్బంది

'మెడికవర్'లో తొలిసారి కిడ్నీ మార్పిడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో తొలిసారిగా కిడ్నీ మార్పిడి ద్వారా రోగి ప్రాణాలను కాపాడగలిగారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న నెఫ్రాలజీ వైద్యనిపుణులు డాక్టర్ రంగనాథరావు, డాక్టర్ కొర్ల విద్యాసాగర్‌ల పర్యవేక్షణలో యూరాలజిస్టు డాక్టర్ దుంపల హరిప్రసాద్ కిడ్నీ మార్పిడికి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈశస్త్ర చికిత్స విజయవంతమైనట్టు వైద్యులు చెప్పారు. ఆరు నెలల క్రితం సంతబొమ్మాళి మండలం నౌపడకు చెందిన ముకుందరెడ్డి అనారోగ్యంతో మెడికవర్ ఆస్పత్రిలోని అత్యసవర విభాగానికి వచ్చారు. అతనని పరీక్షించిన వైద్యులు రెండు కిడ్నీలు పాడైనట్టు నిర్ధారించారు. వెంటనే అతనికి హీమోడయాలిసిస్ ప్రారంభించి ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించగలిగారు. అయితే శాశ్వత పరిష్కారానికి కిడ్నీ మార్పిడి తప్పని సరని వైద్యులు చెప్పడంతో అతని తల్లితండ్రుల నుంచి కిడ్నీ ఇచ్చేందుకు అంగీకరించారు. అతన్ని ప్రాణాలతో కాపాడుకునేందుకు చివరకు అతని తల్లి కిడ్నీ సరిపోవడంతో వైద్య పరీక్షలు నిర్వహించి వారం రోజుల పర్యవేక్షించారు. అనంతరం ఆమె నుంచి కుమారునికి కిడ్నీ మార్పిడి చేశారు. శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్య బృందంలో ఉన్న డాక్టర్ దుంపల హరిప్రసాద్ మాట్లాడుతూ మూత్రపిండాలను నిర్లక్ష్యం చేయొద్దని, నిరంతరం రక్తంలోని వ్యర్థాలను వడకడుతూ అవి అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. నెఫ్రోలోజిస్ట్ డాక్టర్ కొర్ల విద్యాసాగర్ మాట్లాడుతూ కిడ్నీలు పూర్తిగా చెడిపోయిన వారికి తాత్కాలిక రక్తశుద్ధి (డయాలసిస్)తో పాటు కిడ్నీ మార్పిడి చేయవచ్చని అన్నారు. అత్యంత సులువైన, సురక్షితమైన పద్ధతి కిడ్నీ మార్పిడి వల్లే సాధ్యమన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యుల నుంచి కిడ్నీ మార్పిడి చేసుకునేందుకు వీలుందన్నారు. సెంటర్ హెడ్ డాక్టర్ సాగరిక మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలు, పరికరాలు, అనుభజ్ఞులైన వైద్యులు మెడికవర్‌లో అందుబాటులో ఉండడం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు.

ఎన్‌జిఒ నూతన కార్యవర్గం ఎన్నిక

కోటబొమ్మాళి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల ఎన్‌జిఒ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షులు సంతబొమ్మాళి ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి.ఉమాసుందరి, ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ రికార్డు అసిస్టెంట్ ఆర్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కోటబొమ్మాళి మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ లఖినేని షణ్ముఖరావు, సంయుక్త కార్యదర్శిగా బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్ బి.కమల కుమారి, కోశాధికారిగా కోటబొమ్మాళి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల రికార్డు అసిస్టెంట్ ఎం. భారతి, జిల్లా కౌన్సిలర్‌గా కోటబొమ్మాళి మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ వి.వెంకటరావు, కోటబొమ్మాళి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్ టి.వి.నీలరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నరసన్నపేట ఆర్‌డబ్ల్యుఎస్ సీనియర్ అసిస్టెంట్ ఎస్. శాంతారావు, పలాస పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్ ఎల్.శ్రీనివాసరావులు వ్యవహరించారు.


ఎన్నిక నిర్వహిస్తున్న ఎన్‌జిఒలు

ప్రశాంత్‌కుమార్‌కు అబ్దుల్ కలాం అవార్డు


ప్రశాంత్‌కుమార్

కొత్తూరు : మండలంలోని గునభద్రకు చెందిన విద్యా వేత్త, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు అంపిలి ప్రశాంత్ కుమార్‌కు మిస్సైల్ మ్యాన్ అదబ్బుల్ కలాం అవార్డుకు ఎంపికైనట్లు ఫిల్హాఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా మిస్సైల్ అధ్యక్షులు అడ్డంకి రాజా శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత్ విద్యారంగ పరి రక్షణకు కృషి చేస్తూ... సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా సమాజ హితమైన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందజేయడంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ అవార్డును ఈ నెల 27న విజయవాడలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమక్షంలో అందజేయనున్నట్లు తెలిపారు.

పాఠశాలకు టేబుళ్లు వితరణ

పలాస : పలాస ఎంపిపి పాఠశాలకు నాలుగు టేబుళ్లను పలాసకు చెందిన బద్రి గోపాల్ వితరణగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నాల సోమేశ్వరరావు ఉపాధ్యాయుల సమక్షంలో శుక్రవారం టేబుళ్లను అందించారు. ఈ సందర్భంగా గోపాల్‌కు పాఠశాల ఉపాధ్యాయులు తమ ధన్యవాదములు తెలిపారు.



మాట్లాడుతున్న జనప్రియ

వన్యప్రాణులను సంరక్షించాలి

నరసన్నపేట: వన్యప్రాణులను, అడవులను ప్రతిఒక్కరూ సంరక్షించాలని ఫారెస్టు అధికారి ఎం.జనప్రియ సూచించారు. నరసన్నపేట రవీంద్ర భారతి స్కూల్‌లో భూమిని రక్షించే పేరుతో శుక్రవారం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవుడు తమ కనీస అవసరాలు తీర్చుకునే విధంగా తమకు తామే ముందుకు వచ్చి అడవులను కాపాడుకోవాలన్నారు. అన్నింటికీ మూలాధారం అడవులే అని పేర్కొన్నారు. పర్యావరణ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల్లో ఉన్న సందేహాలను అడిగి నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ నాగరాజు, డిఐ రమేష్, ప్రిన్సిపాల్ ధర్మాన వాసుదేవరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి- నందిగాం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందుబాటులో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధికారులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖాధికారి శ్రీకాంత్ వర్మ ఆధ్వర్యాన శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో కొన్నిచోట్ల రైతులు వేసిన వరి విత్తనాలు మొలకెత్తలేదని, దీనిపై విఎఎల ద్వారా గ్రామాల్లో సమాచారం సేకరించాలని సూచించారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి అంబోడి విష్ణు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు అందజేయాలని వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ పినకాన వైకుంఠరావు అన్నారు. టెక్కలి రైతు భరోసా కేంద్రం-2 విఎఎలతో సమీక్షించారు. కౌలు రైతులకు రైతు భరోసా అందేలా, ఈ-క్రాప్ వంద శాతం చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ ఎడి బి.తిరుమలరావు మాట్లాడుతూ రైతులకు రాయితీపై టార్పాలిన్లు, స్ప్రేయర్లు అందజేస్తున్నామని తెలిపారు. హార్టీ కల్చర్ ఆఫీసర్ సునీత మాట్లాడుతూ రైతులకు ఉచితంగా జీడీ మొక్కలు ఇస్తామని అన్నారు. 50 శాతం సబ్సిడీపై కూరగాయల విత్తనాలు, స్ప్రింకర్స్, కొబ్బరి మొక్కలు, 35 శాతం సబ్సిడీతో ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఎఒ రంగారావు, ఆర్‌బికె చైర్మన్లు, విఎఎలు పాల్గొన్నారు.


నందిగాం : మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

కవిటి: మండలంలోని కౌలు రైతుల గుర్తింపు సక్రమంగా నిర్వహించడం లేదని, ప్రతి సచివాలయం పరిధిలోనూ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి పూర్తిస్థాయిలో కౌలు రైతులను గుర్తించాలని వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బందికి ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. సచివాలయం సిబ్బంది రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకొని కౌలు రైతుల గుర్తింపు పక్కాగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ రూప, ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత పాల్గొన్నారు.



సఫాయి కార్మికులతో మాట్లాడుతున్న అనంతరావు

'సఫాయి'ల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా సఫాయి కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వాల నుంచి సరైన సౌకర్యాలు కల్పించక పోగా, ఏళ్ల తరబడి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులుగా కొనసాగిస్తూ వెట్టి చాకిరీకి గురి చేస్తున్నారని అఖిల భారత సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రధాన కార్యదర్శి ఎల్.,అనంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని పారిశుధ్య కార్మికుల సమస్యలపై డివిజన్ అధికారులతో శుక్రవారం చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇస్తున్నారని, గద్దెనెక్కిన తర్వాత ఆ సమస్యలను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జిల్లా పర్యటనలకు వచ్చిన ఆయన సఫాయి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మజ్దూర్ కాంగ్రెస్ ముఖ్య సలహాదారుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆర్.జి.ఈశ్వరరావు, ఆర్గనైజర్ సెక్రెటరీ ఆర్.జి.తిరుపతి రావు, ఉపాధ్యక్షులు కడపటి వేణుగోపాలరావు, పార్థసారథి పాల్గొన్నారు.



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న సభ్యులు

తెప్పలకు 'బంగారు తెలంగాణా 'అవార్డు

పలాస : హైదరాబాద్ ఆదర్శ కళానిలయం ఆధ్వర్యాన డాక్టర్ దేవుపల్లి రామానుజరావు కళా మందిర్‌లో తెలంగాణా దశాబ్ధి ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలాసకు చెందిన రచయిత, నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి 'బంగారు తెలంగాణా అవార్డును అందజేశారు. దుశ్శాలవు కప్పి సన్మానించి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు చేరాల ప్రకాష్, నటులు, ఇసి మెంబరు డాక్టర్ మాణిక్, దైవజ్ఞశర్మ, సినీ, టివి నటులు డాక్టర్ అశోక్ కుమార్, హీరో విజయ భాస్కర్, నటి దివ్యవాణి పాల్గొన్నారు.

కొర్లాం పిహెచ్‌సి సేవలు పునరుద్ధరణ



సోంపేట : పునర్నిర్మాణం జరుపుకున్న కొర్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను పరిసర ప్రాంత ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి తడక యశోద, ఎంపిపి డాక్టర్ దాసు కోరారు. డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ సౌజన్యంతో పునర్నిర్మించిన కొర్లాం పిహెచ్‌ని శుక్రవారం నుంచి సేవలను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పిహెచ్‌సిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. 68 రకాల వైద్య పరీక్షలు సైతం నిర్వహిస్తున్నారని అన్నారు. గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జోగారావు, శంకర్, శ్రీకృష్ణ, మోహన్, పాపారావు, రెడ్డిస్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, పవన్ కుమార్, వైద్యులు సౌజన్య, వందిత పాల్గొన్నారు.

ఈశ్వరమ్మ సేవలకు సన్మానం



సన్మానిస్తున్న రాంబాబు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం నార్త్ కేబిన్ దగ్గర మూడు నెలల నుంచి యువ సూర్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఈశ్వరమ్మ చలివేంద్రం ఏర్పాటు చేసి సేవలందించారు. శుక్రవారం ముగింపు సందర్భంగా ట్రస్టు చైర్మన్ రాంబాబు, సత్యసాయి స్కూల్ చైర్మన్ సాహుకరి కృష్ణమూర్తిలు ఆమెకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. నగదు, దుస్తులు, నిత్యావసర వస్తువులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చలివేంద్రం ముడు నెలల నుంచి సేవలందిస్తున్న ఈశ్వరమ్మ సేవలను మరువలేమని కొనియాడారు. కార్యక్రమంలో మచిన్ని, భైరి, సుగ్గ ప్రేమ్‌కుమార్, ఈశ్వరరావు, వరదరాజు, అభిమన్యు సాహు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

మందస: మొక్కలు నాటడం ద్వారా స్వచ్ఛమైన గాలి, నీడ ఇస్తుందని గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ అన్నారు. మండలంలోని రాధాకృష్ణాపురం బస్టాండ్ ఆవరణలో గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యాన శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులు సౌకర్యార్థం ఊరిలో బస్టాండ్ ఉన్నా... ఎదురు రోడ్డులో ప్రయాణికులకు ఎండలో ఉండిపోతున్నారని అన్నారు. గ్రామ పెద్దలు తలంపుతో మొక్కను నాటామని అన్నారు. వర్షాలు పడే సమయం ఆసన్నమైందని, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ తాతయ్య గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కొంచాటి ఆనంద్, గ్రీన్‌ఆర్మీ సభ్యులు నగరి కరుణాకర్, కె.అభిలాష్, ఎల్.దుర్వసులు, పెద్దలు పి.భాస్కరరావు, పి.రాంబాబు, ఎల్.జయరామ్, కార్యదర్శి బందావు తిరుమల పాల్గొన్నారు.

అంతర పంట సాగుతో అదనపు ఆదాయం



విత్తనాలను నాటుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి- ఆమదాలవలస

వరి పంట సాగుతో పాటుగా అంతర పంటగా కూరగాయల సాగును చేపడితే రైతులకు అధిక ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలో భాగంగా సిబ్బంది సురేష్ కాంపాక్ట్ బ్లాక్ వరి సాగు చేసే పొలాల గట్లపై పలు రకాల కూరగాయల విత్తనాలను శుక్రవారం నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి రేవతి ఆదేశాల మేరకు వరి పొలం గట్లపై రైతులు చేత పలు రకాల కూరగాయల సాగును చేపట్టేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కాంపాక్ట్ బ్లాకుల్లో ముఖ్యంగా గట్లపై ఖాళీ లేకుండా కంది, బంతి, కూరగాయల విత్తనాలను వేయించి రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వరిలో ప్రకృతి సేద్యంలో రాజీలేని సూత్రాలు పాటిస్తూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

రణస్థలం రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వ్యవసాయం రైతులకు లాభదాయకమని రణస్థలం డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జి గంట్యాడ ఏసుబాబు రైతులకు సూచించారు. మండలంలోని రావాడలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సామూహికంగా వరి బీజామృతంతో విత్తన శుద్ధి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసిన తరువాత వరి నారు వేయడం వల్ల భూమి నుంచి విత్తనం నుంచి వచ్చిన తెగుళ్లను అరికట్టవచ్చునన్నారు. వరి చేను గట్లపైన కంది, బంతి, చిక్కుడు పెట్టడం వల్ల వరిలో పురుగు ఉధృత తగ్గుతుందన్నారు. వరికి పట్టాల్సిన పురుగులు బంతి పువ్వుల పైకి వెళ్తాయని వివరించారు. వరి లైన్ షోయింగ్ పద్ధతిలో వేసుకోవాలన్నారు. ఘన ద్రవ నీమాస్త్రాలు వంటి 15 రోజులకు ఒకసారి వేయాలన్నారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిఎస్ రమణమ్మ, సూర్యం, ఐబిఐసిఆర్‌పి సుజాత పాల్గొన్నారు.

వాలంటీర్లను రెచ్చగొట్టడం సరికాదు



మాట్లాడుతున్న నాయకులు

కోటబొమ్మాళి: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడిన మాటలను వైసిపి నాయకులు తప్పుగా దుష్ప్రచారం చేసి వారికి రెచ్చకొడుతున్నారని టెక్కలి నియోజకవర్గ నాయకుడు కోటేశ్వరరావు అన్నారు. స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధిపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. అవినీతే లక్ష్యంగా నైపుణ్యం కలిగిన లక్షలాది మంది యువతకు కేవలం రూ.5 వేలు ఇచ్చి వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని మండిపడ్డారు. యువతను వైసిపి కార్యకర్తలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ క్యాలెండర్ లేదు, ఉపాధి అవకాశాలు లేవు, అభివృద్ధి లేదని... ఇలా ఏ ఒక్క సిద్ధాంతాలపైన మాట్లాడ లేని వైసిపి నాయకులు పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు జనార్ధన్, ప్రసాద్, వినోద్, చందు, భాస్కర్, చిరంజీవి సందీప్, పవన్ ధనరాజ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ గణేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలు అభినందనీయం వన్ టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ అన్నారు. నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో లయన్స్ క్లబ్ సభ్యులు సొంత నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి బోర్‌వెల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ వచ్చే వారికి, ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు ఉపయోగ పడుతుందన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేసి క్లబ్ సేవలను విస్తృత పరచాలన్నారు. కార్యక్రమంలో మెంటార్ నటుకుల మోహన్, క్లబ్ ప్రెసిడెంట్ పొన్నాడ రవికుమార్, జోన్ చైర్మన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, సెక్రెటరీ టి.రాంగోపాల్, ట్రెజరర్ శిల్లా మణి, ఊణ్ణ కిరణ్, కామేష్, పొడుగు చరణ్, రాజు, లయన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ సునీల్, రామ్మోహన్ పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం



నందిగాం : ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నందిగాం : మండలంలోని సుభద్రాపురానికి చెందిన పత్తి శాంత కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. 1998-99లో నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో చదువుకున్న సహచర విద్యార్థులంతా కలిసి మృతుడి భార్యకు శుక్రవారం రూ.35 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో వట్టి విశ్వనాథం, మాదిన ప్రసన్న, ఇందిరా, సనపల నాగేష్, నడుపూరు రాంబాబు, బోరుభద్ర సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లా గ్రామం శివ కాలనీకి చెందిన నిరుపేద వడ్డి కరియ్యా, నారాయణమ్మ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బ్రాహ్మణతర్లా హెల్పింగ్ వారియర్స్ ఆధ్వర్యాన బమ్మిడి వరప్రసాద్, తిరుమల మానవత్వంతో ముందుకొచ్చి రూ.5,500 ఆర్థికసాయం అందజేశారు. నెలకు సరిపడేలా రేషన్ సరుకులు పంపిణీ చేశారు.



ఓంకార్ సంతకం తీసుకుంటున్న రాజు

సంతకాల సేకరణ పూర్తి

కవిటి: కిడ్నీ సమస్య పరిష్కరించాలని కోరుతూ జనసేన ఆధ్వర్యాన ఇచ్ఛాపురం నియోజకవర్గంలో చేపడుతున్న లక్ష సంతకాల సేకరణలో భాగంగా శుక్రవారానికి పది వేల సంతకాలు పూర్తయ్యాయి. మండలంలోని కుసుంపురంలో బాలుడు జుత్తు ఓంకార్ సంతకంతో 10 వేల సంతకాలు పూర్తయినట్టు నియోజకవర్గం జనసేన సమన్వయకర్త దాసరి రాజు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జుత్తు ఓంకార్ కిడ్నీ వ్యాధికి గురై ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కానీ, అతనికి వస్తున్న పింఛను మందులకే సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సమస్యల పరిష్కారానికికే లక్ష సంతకాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో జన సైనికులు డొక్కరి ఈశ్వరరావు, రోకళ్ల భాస్కర్, దుగాన దివాకర్, అంగ సురేష్, రామకృష్ణ, రాజా, రాజు, సతీష్, చలపతి, నవీన్, మోహన్ పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

ఆమదాలవలస : పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపంలో గొలివి ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, యువకులు పాల్గొని రక్తదానం చేయాలని కృత్విక్ ఫౌండేషన్ చైర్మన్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. రక్తదానంపై అపోహలను విడనాడి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. రక్తదానం చేయడం సామాజిక సేవా కార్యక్రమమని, ఎటువంటి అపోహలు వద్దని అన్నారు.

'జల్ జీవన్' పనులు ప్రారంభం

బూర్జ : మండలంలోని బొమ్మిక గిరిజన గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులను పిఎసిఎస్ డైరెక్టర్ గోవిందరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గిరిజన గ్రామాలోనూ తాగునీటితో పాటు రోడ్ల సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ డి.వి.నాయుడు, పున్నాన శ్రీను, పోతాల లక్ష్మణరావు, కొండగొర్రి రామారావు, ఆనంద్, సవర బాపన్న, ముఖలింగం, నాగరాజు, చిన్నారావు పాల్గొన్నారు.



జయశ్రీని సన్మానిస్తున్న సభ్యులు

సేవా కార్యక్రమాల్లో మహిళలు

పలాస: సేవా కార్యక్రమాల్లో విరివిగా మహిళలు పాల్గొనడం, సేవలు అందించడం ఆనందంగా ఉందని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. స్థానిక లయన్స్‌క్లబ్‌లో క్యాజు ల్యాండ్ వనిత ఆధ్వర్యాన శుక్రవారం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ క్యాజులాండ్ వనిత సంస్థ ద్వారా రక్త దానం, వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమం ఇలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నూతన అధ్యక్షులుగా మల్లా జయశ్రీ, కార్యదర్శిగా తర్లాల శ్వేతకుమారి, కోశాధికారిగా మల్లా సంతోషిలు ప్రమాణస్వీకారం చేపట్టారు. అనంతరం ఎంపికైన సభ్యురాలకు దుశ్శాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో చార్టెడ్ అకౌంట్ వూన మోహనరావు, టిఎస్ఎం గుప్త, తూముల శ్రీనివాసరావు, వి.రంగనాథం, మాజీ కౌన్సిలర్ బల్ల ఉషారాణి పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పోలాకి: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని ఎస్.ఎల్.పురం పంచాయతీ సన్యాసిరాజుపేటలో రూ.8 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. నిర్మాణంలో నాణ్యతా ప్రామాణాలు పాటించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయిడు, సర్పంచ్ ప్రతినిధి వై.వెంకటరమణ, ఆర్.త్రినాథరావు, కణితి సత్తిబాబు, చింతాడ ఉమా, పి.జగన్ పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు

పవణ్ కళ్యాణ్‌పై ఫిర్యాదు

పోలాకి : జనసేన పార్టీ అధినేత పవణ్ కళ్యాణ్‌పై ఉరజాం పంచాయతీ వాలంటీర్లు ఎస్ఐ సత్యనారాయణకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం యువకులను ప్రోత్సాహం చేసేవిధంగా వాలంటీర్ వ్యవస్థ పెడితే, కేవలం రాజకీయ కోణంలో ఆలోచించి వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. అటువంటి వారుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాలంటీర్లు జె.కొండలరావు, యి.అప్పన్న, ఆర్.రాజేశ్వరి, యి.హేమలత, కె.సునీత, కె.స్వాతి, ఎల్.లావన్య, ఎస్.లక్ష్మణరావు, ఆర్.కృష్ణారావు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేటిపాలెంలో 'గడప గడపకు'

ప్రజాశక్తి- లావేరు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని లావేటిపాలెం సచివాలయం-2లో గడపగడపకు మన ప్రభుత్వం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సచివాలయల మండల కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, ఎంపిడిఒ కుప్పిలి సురేష్‌కుమార్, ఎపిఎం మావూరి మాధవిలత, ఎంపిటిసి ఇనపకుర్తి సతీష్, మాజీ ఎంపిపి డి.రాజినాయుడు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయాలి



మోహనరావు

వజ్రపుకొత్తూరు : ఈ నెల 16న మండలంలో నిర్వహిస్తున్న టిడిపి బస్సు యాత్రను కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు సూరాడ మోహనరావు కోరారు. శుక్రవారం అక్కుపల్లిలో తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా ప్రకటించిన మహాశక్తి, మినీ మేనిఫోస్టో ప్రచారంలో భాగంగా మండలంలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. ఉదయం 11 గంటలకు బెండిగేట్ వద్ద ఉన్న హుదూద్ ఇళ్లను సందర్శించి ప్రారంభిస్తామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

విద్యార్థులు పరిసరాలను పరిశ్రభంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని ఎంఇఒ-2 పట్నాన రాజారావు అన్నారు. మండలంలోని లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సంస్థలో పరిశుభ్రతపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం కండ్ల కలకలు ఎక్కువగా వస్తున్నాయని, విద్యార్థులు చుక్కల మందు వాడటం వంటి జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ఏరియా మేనేజర్ బి.ఎం.పాల్, కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, సిబ్బంది మోహన్, ఉగాది, శ్రీను, స్వాతి, మాలతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

అచ్చెన్నను కలిసిన నాయకులు

కోటబొమ్మాళి: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును అమరావతి మంగలగిరిలో టిడిపి మహిళా నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలో నిర్వహించిన మహాశక్తి కార్యాక్రమానికి వెళ్లిన పూజారి శైలజ, వెలమల విజయలక్ష్మి, వాన లక్ష్మి, బెండి అన్నపూర్ణ, దేవాది సింహాద్రమ్మలు ఉన్నారు.